# 19. పిసినిగొట్టు ప్రేమపురాణం

బ్రిటిష్ వారికి విశ్వాసపాత్రుడైన మిత్రుడుగా చరిత్ర ప్రసిద్ధుడైన నిజాం నవాబు ల్యూటినెంట్ జనరల్, హిజ్ ఎక్జాల్టెడ్ హైనెస్, ఆసఫ్‌జా ముజఫర్ ఉల్‌ముల్క్, నిజాం ఉల్‌ముల్క్, నిజాం ఉద్దౌలా, సర్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహద్దర్, ఫతేజంగ్ వారు ఆ వంశీకులలో పదవ వారు.

1911లో శ్రీవారు సింహాసనారూఢులయే నాటికి ప్రపంచ ప్రసిద్ధమూ, సువిశాలమూనైన వారి రాజభవనం కింగ్ కోఠీలోని అనేక గదుల్లో మనుషులు నివస్తూండేవారు గారు. ఆ గదుల నిండా బంగారం, వజ్ర వైఢూర్యాలూ కుప్పలుగా మూలుగుతుండేవి. వాటిని లెక్కబెట్టిన వారుగానీ, విలువ కట్టగల వారుగానీ లేరు. ప్రపంచ ప్రసిద్ధమైన 282 కారట్ల బరువుగల జాకబ్ డైమండ్‌ను శ్రీవారు సరదాగా పేపర్ వెయిట్‌గా వాడుతుండేవారంటే వారి ఖాజనా గదుల్లో గల వజ్ర వైఢూర్యా లెటువంటివో ఊహించుకోవచ్చు. అవన్నీ గుట్టలుగా పడివున్న గదుల తాళం చెవులు సదా శ్రీవారి బొడ్లోనే ఉండేవి. ఆయన ఎవర్నీ నమ్మేవారుకారు. ఏమీ తోచనప్పుడల్లా ఆ గదుల్లో ప్రవేశించి, వెండి, బంగారాలనూ, వజ్ర వైఢూర్యాలనూ విసుగెత్తే దాకా లెక్కబెట్టటం అనేది శ్రీవారి కాలక్షేపంగా ఉండేది.

ఇన్ని ఉన్నా నవాబుగారు బహు పొదుపుగా జీవించేవారు. పైసా ఖర్చు పెట్టాలంటే శ్రీవారి ప్రాణం గిలగిలలాడి పోయేది. ఎవరేనా అతిథు

లుగావస్తే టీతో పాటుగా కేవలం రెండు బిస్కట్లు మాత్రం వారికి ముట్టేవి.

అలాంటి నవాబుగారు యువకులుగా ఉండగా ఓసారి అమాంతం ప్రేమలో పడ్డారు.

కపూర్తలా సంస్థానాధీశులైన మహారాజా జగత్‌జిత్ సింహజీవారు స్పానిష్ దేశస్తురాలైన ఓ అందాల రాణిని వివాహమాడి కపూర్తలాకు వేంచేసేరు. ఆవిడకు హిందూమతం ఇప్పించి ప్రేమ్‌కౌర్ అనినామకరణం కూడా చేసేరు. ఆవిడ అతిలోక సౌందర్యాన్ని గురించి విన్న నవాబుగారు ఆవిడను చూడాలని తహతహలాడిపోయేరు.

అందుమీదట నవాబుగారు మహారాజా జగత్‌జిత్ సింహజీ వారిని తమ సంస్థానాన్ని పావనంచేసి తమ అతిధ్యం స్వీకరించ వలసిందిగా కోరుతూ రాజోచితంగా ఆహ్వానం పంపేరు.

ధనికుడుగా ప్రపంచ ప్రసిద్ధుడైన నవాబుగారి ఆహ్వానానికి మురిసిపోయిన జగత్‌జిత్ సింహజీ వారున్నూ సపరివార సమేతంగా హైదరాబాదుకు వేంచేసేరు. అక్కడ వారికి ఎవరికీ, ఏనాడూ లభించనంతటి ఘనస్వాగతం లభించింది.

ప్రతి సాయంత్రం నవాబుగారు మహారాజావారికీ, మహారాణీవారికీ ఘనమైన విందు చేసేవారు. విందు బల్లముందు ఆశీనయై ముందుగా చేతులు తుడుచుకునే నాప్‌కిన్ మడత తెరవగానే మహారాణీ వారికి ఆ సందులో వజ్రాల హారమో, రత్నాభరణమో కనిపిస్తూండేది. అది ఆవిడకు నవాబుగారి బహుమతి అన్నమాట. ఆ విలువైన కానుకలకు ఆవిడ మురిసి పోతుండేది. నవాబుగారి ఐశ్వర్యానికి అదరిపోతుండేది.

ఇలా కొన్ని వారాలపాటు అనుదినం గడచిపోతుండేది. మహారాజా

వారు తిరుగు ప్రయాణానికి సిద్ధమయినా నవాబుగారు మాత్రం మరికొన్ని రోజులుండమని బ్రతిమాలు తుండేవారు. మహారాజావారున్నూ నవాబు గారికి తనమీదగల అభిమానానికి ముగ్ధులైపోతుండే వారు.

అసలు సంగతేమంటే నవాబుగారికి మహారాణీ ప్రేమకౌర్‌తో ఏకాంతంగా గడిపే అవకాశం కలసిరాలేదు ఆవిడ అందం శ్రీవారికి పిచ్చెక్కించేస్తోంది.

అందుకని శ్రీవారేం చేశారంటే... !

ఓ సుదినాన తన బేగంచేత అంతఃపురంలో ఘనమైన విందు ఒకటి ఏర్పాటు చేయించేరు. బేగంగారు మహారాణీ ప్రేమ్‌కౌర్‌ను ఆ విందుకు ప్రత్యేకంగా ఆహ్వానించేరు.

నవాబుగారి వాలకం చూస్తున్న మహారాజావారికి తన ముద్దుల రాణిని ఒంటరిగా కోఠీకి పంపటం సుతరాం యిష్టం లేదు. కానీ, బేగం గారి ఆహ్వానాన్ని కాదనటం మర్యాదకాదు.

చివరకు మహారాణి ప్రేమ్‌కౌర్ తన ఫ్రెంచి పరిచారికను ఒక త్తెను మాత్రం వెంటదీసుకుని, ఇద్దరు అంగరక్షలు వెంటరాగా విందుకు బయలు దేరేరు.

కింగ్ కోఠీ గేటు దాటగానే మహారాణీ వారి అంగరక్షకులు అక్కడనే ఆపివేయ బడ్డారు. పరిచారిక అంతఃపురం గుమ్మంలోనే ఆపి వేయబడింది వారందరినీ అతిధుల గదిలో కూర్చుండమనీ, అది అక్కడి సంప్రదాయమనీ తెలియజెప్పేరు.

అప్పుడు, నవాబుగారి పెద్ద బేగం స్వయంగా విచ్చేసి మహారాణీని స్వయంగా లోనికి తోడ్కొనిపోయేరు.

అక్కడ... !

ఇంద్రభవనంలాంటి బేగంగారి గదిలో... !

మహారాణీకి సాక్షాత్తు హిజ్ ఎగ్జాల్టెడ్ హైనెస్, ల్యాటినెంట్ జనరల్, అసఫ్‌జా, ముజఫర్ ఉల్‌ముల్క్, నిజాం ఉల్ ముల్క్, నిజాం ఉద్దౌలా, సర్‌మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహద్దర్, ఫతేజంగ్‌వారు ఎదురై స్వాగతం ఇచ్చేరు.

బేగంగారు ప్రక్కకు తప్పుకున్నారు. మహారాణీ వారికి కథ అంతా అర్థం అయిపోయింది.

నవాబుగారావిడకు ఆ సంధ్యవేళ వెలలేని కానుకలెన్నో సమర్పించేరు. జీవితంలో ఏనాడూ ఎవరికీ ఇవ్వని అతిధ్యం ఇచ్చేరు.

ఆ తర్వాత... ?

ఏం జరిగిందో మనకు తెలియదుగానీ, ఇక్కడ మహారాజా జగత్‌జిత్ సింహజీవారుమాత్రం అర్ధరాత్రయినా మహారాణీవారు తిరిగిరాకపోతే సవాలక్ష అనుమానాలతో సతమతమైపోయేరు. అమర్నాడే మహారాణీ సమేతంగా కపూర్తలాకు పయనమై వెళ్ళిపోయేరు.

కొద్ది మాసాల తరువాత... !

నిజాం నవాబుగారు కబురు చేసేరు "మీ సంస్థాన వైభవాన్ని స్వయంగా చూసి ఆనందించ దలచాం... !" అని.

కానీ, మహారాజా జగత్‌జిత్ సింహజీవారు మాత్రం ఒళ్ళు ఎంతగా మండుతున్నా మర్యాదగా తాను విదేశాలకు వెడుతున్నానని కబురంపి నవాబుగారు అటురాకుండా చేసేరు.

అందుకే నిజాం సంస్థానాధీశులకూ, కపూర్తలా సంస్థానాధీశులకూ ఈనాటికీ సత్సంబంధాలులేవు.

★